
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025





ఇగోలు వద్దు

ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవద్దు

నేను అన్నీ గమనిస్తున్నా.. నాకన్నీ తెలుసు

'నాకేం తెలియదు.. నేనేం చూడట్లేదని అనుకోవద్దు. మీరేం చేస్తున్నారో నాకు ఎప్పటికప్పుడు రిపోర్టు వచ్చేస్తుంది. నాకు కార్యకర్తలే ముఖ్యం. ఇగోలను పక్కన పెట్టండి. ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుని పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దు. ఎవరేమిటన్నది నా దగ్గర సమాచారం ఉంది. అవినీతిని సహించను. ప్రజలు మనల్ని గమనిస్తూ ఉంటారు. మనం ఏం చేస్తున్నామో పరిశీలిస్తూ ఉంటారు. సామాజిక న్యాయం చేస్తున్నామా లేదా? మంచి పనులు చేస్తున్నామా లేదా? మనం ఎలా ఉంటున్నామనేదీ ప్రతీదీ చూస్తారు. అంచనా వేస్తారు. కాబట్టి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు. నియోజకవర్గంలో అన్ని తరగతుల వారు ఓట్లు వేస్తేనే విజయం సాధించామన్నది గుర్తు పెట్టుకోవాలి. అసెంబ్లీయే కాదు పార్లమెంట్ నియోజకవర్గాలపై కూడా దృష్టిపెడతా..' అని సీఎం చంద్రబాబు నందిగామ నియోజకవర్గ పార్టీ నేతలను సుతిమెత్తగా హెచ్చరించారు.

- పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- కార్యకర్తలంటేనే నాకు ఎక్కువ ప్రేమ
- నాయకులు అటూ ఇటూ పోయినా..
- కార్యకర్తలు పార్టీని భుజాన వేసుకుంటారు
- ఇక 2029 ఎన్నికల కోసం పనిచేయండి
- పార్లమెంట్ నియోజకవర్గాలపైనా దృష్టి
- నందిగామ కార్యకర్తలు, నేతలతో సీఎం చంద్రబాబు
- పార్టీ నాయకులకు సుతిమెత్తగా క్లాస్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కార్యకర్తలపైనే తనకు అభిమానం ఉంటుందని, నాయకులు అవకాశవాదంతో ఉంటారని, వారు అటూ ఇటూ మారినా.. కార్యకర్తలు మాత్రం పార్టీని భుజాలకెత్తుకుని పనిచేస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల వచ్చిన ఆయన మిగతా 6లో..

గెలిచాక పనిచేయకపోతే ఎలా..?

2024 ఎన్నికల్లో అందరూ పనిచేశారని, మంచి ఫలితాలు వచ్చాయని, గెలిచాక పనిచేయటం తగ్గించారని చురకలు అంటించారు. నందిగామ నియోజకవర్గంలో ప్రజలకు అందాల్సినవి అందుతున్నాయని, అర్జీలు కూడా పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు.





సీఎంను చూసిన ఆనందంలో మహిళల సందడి, జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య, లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు

ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకానికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ పథకానికి మరమ్మతులు చేసేందుకు సీఎం చంద్రబాబు నిధులు కేటాయించడంపై నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదికలో పాల్గొన్న సీఎం కీలకమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పాటు పీ4 కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ల అభివృద్ధికి ముఖ్యమైన సూచనలు చేయడంపై హర్షం వ్యక్తమైంది.

వరాల జల్లు

వేదాద్రి-కంచెల ఎత్తిపోతలకు ఇక విముక్తి

రూ.15 కోట్లు మంజూరుచేసిన సీఎం చంద్రబాబు

- మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశాలు
- ఇకపై ఎత్తిపోతల బాధ్యతలు రైతు సంఘాలకు..
- ఏటూరు-మోగులూరు వద్ద మునేటిపై కాజ్‌వే నిర్మాణం
- ఏనుగుగడ్డ వాగుపై వంతెనల నిర్మాణానికీ నిధులు
- సుబాబుల్, మిర్చి సమస్యలు పరిష్కారిస్తామని హామీ
- పీ4 కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ల అభివృద్ధికి ప్రణాళిక
- జగ్జీవన్‌రామ్ జయంతిలో సందడిగా గడిపిన సీఎం

చందర్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.15 కోట్లు మంజూరు చేశారు. మెట్ట రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు చూపుతో గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పథకం మూలన పడటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు పట్టించుకోలేదని, ఒక్కపైసా కూడా కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. సాగునీటి ఎత్తిపోతల పథకాలను మూలనపెట్టారని మిగతా 6లో..





ప్రజావేదిక సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) ముప్పాళ్లలో కోండ్రు వెంకటేశ్వరరావు ఇంట్లో కాఫీ కాస్తున్న సీఎం

గురుకుల పాఠశాల సందర్శన 6లో

వెనుకబడిన వర్గాల అభివృద్ధే పీ4 లక్ష్యం

- ఎంపీ శివనాథ్ వెల్లడి

అహంకారం ఉంటే ప్రజలు దూరమవుతారు

- టీడీపీ నాయకుడు శావల దేవదత్
- జగ్జీవన్‌రామ్ జయంతిలో ఎమ్మెల్యే కార్యక్రమానికి నాయకుల డుమ్మా
- ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణ

6లో

ప్రజాబలం ఉన్నవాళ్లే నాయకులు

- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు

నీటి కష్టాలు

జిల్లాకు పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి ● 266 చెరువుల్లో పడిపోయిన నీటిమట్టం

- తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోనూ అంతే
- తీరానికి ట్యాంకర్ల ద్వారా అందించే ప్రతిపాదనలు
- రూ.1.12 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక
- 15 నుంచి ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు నీరు
- 4 నుంచి 5 టీఎంసీల వరకు అందించే అవకాశం
- ఆశగా ఎదురుచూస్తున్న తీరప్రాంత వాసులు

అడుగంటుతున్న తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోని నీరు



ఏప్రిల్ వచ్చేసింది. వడగాల్పులతో పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలోని తీరప్రాంతంతో పాటు ఇతర ఏరియాల్లోని తాగునీటి చెరువుల్లో నిల్వ ఉన్న నీరు క్రమంగా అడుగంటుతోంది. దీంతో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం కనిపిస్తుండగా, మోపిదేవి, నాగాయలంక, కోడూరు, కృత్తివెన్ను, మచిలీపట్నం తదితర మండలాల్లో ఇప్పటికే తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారా.. అని కృష్ణాజిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని తీరప్రాంతంలో ఉన్న కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, మచిలీపట్నం తదితర మండలాల్లో వేసవిలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.1.12 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాల్సి ఉంది. దీనికి అనుబంధంగా ఈ వేసవిలో తీరప్రాంతంలోని గ్రామాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తన ఎంపీ లాడ్స్‌తో పాటు సీఎస్ఆర్ నిధులు రూ.3.30 కోట్లు కేటాయిస్తానని ఇటీవల జరిగిన దిశ సమావేశంలో ప్రకటించారు. ఈ నిధులు కూడా విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులన్నీ విడుదలైతే ఈ ఏడాది వేసవిలో తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయి.

15 నుంచి కాల్వలకు నీటి విడుదల

ఫిబ్రవరి 26 నుంచి కాల్వలకు సాగునీటి విడుదలను నీటిపారుదల శాఖ అధికారులు నిలిపివేశారు. అప్పట్లో జిల్లాలోని 266 తాగునీటి చెరువులను మిగతా 6లో..

కర్రంట్ షాక్

దండిగానపూడి గ్రామానికి కర్రల సాయంతో 11 కేవీ విద్యుత్ లైన్లు

అది కూడా పెద్ద చేపల చెరువులో ఏర్పాటు

- ప్రమాదకరమంటున్నా పట్టని అధికారులు
- ఈనెల 2, 3 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మరమ్మతులకు రెండు రోజుల సమయం
- వెంటనే లైన్లు మార్చాలని గ్రామస్తుల వేడుకోలు

చేపల చెరువులో కర్రలే స్తంభాలుగా విద్యుత్ లైన్





కర్రల సహాయంతో చెరువులో నిలబెట్టిన విద్యుత్ లైన్

ఆంధ్రజ్యోతి-గుడివాడ : చేపల చెరువులో కర్రల సాయంతో 11 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయడాన్ని మీరెక్కడైనా చూశారా? నందివాడ మండలం దండిగానపూడి గ్రామంలో ఈ విడ్డూరం కనిపిస్తుంది. ఈ గ్రామానికి వెళ్లే విద్యుత్ వైర్లను ఇలా చేపల చెరువులో నుంచి లాగారు. పొరపాటున విద్యుత్ వైర్లు తెగినా, ఊడిపోయి చెరువులో పడినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా గుడివాడలోని విద్యుత్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోవట్లేదు.

మరమ్మతులకు ఇబ్బందిగా..

ఈ నెల 2, 3 తేదీల్లో దండిగానపూడి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కరెంట్ లేక వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. చేపలు, రొయ్యల చెరువుల రైతులు ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తులు మిగతా 6లో..

మురిసిన ముప్పాళ్ల

• ప్రజావేదిక కార్యక్రమం నిర్వహణ • సమస్యలు అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు • అక్కున చేర్చుకుని అభిమానం చాటుకున్న గ్రామస్థులు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాకతో ముప్పాళ్ల గ్రామం మురిసిపోయింది. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికపై గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించిన చంద్రబాబును స్థానికులు అక్కున చేర్చుకుని తమ అభిమానం చాటుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ముప్పాళ్ల గ్రామస్థులు



ముప్పాళ్లలో ప్రజావేదిక సభకు తరలివస్తున్న ప్రజలు

చందర్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణ ప్రసాద్, కొలికిపూడి శ్రీనివాసరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు, ఆర్డీవో బాలకృష్ణ, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవి, టీడీపీ నాయకురాలు ఆచంట సునీత, ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, మునిసిపల్ ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబు, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

జగ్జీవన్‌రామ్‌కు చంద్రబాబు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు ఘనంగా నివాళులర్పించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల ప్రజావేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా యాభై సంవత్సరాలు ఎంపీగా సేవలు అందించటం గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు.

వర్చువల్‌గా ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభం

ముప్పాళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం ముప్పాళ్ల వచ్చిన ఆయన సభా వేదిక వద్ద నుంచి రిమోట్ సాయంతో విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పని చేయాలని కోరారు.

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే సౌమ్య

సీఎం చంద్రబాబు నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కంటతడి పెట్టారు. సభ ప్రారంభించిన సౌమ్య మాట్లాడుతూ తన తల్లి చంద్రబాబు అభిమాని అని, ఆయన పాలనా విధానాలు, నిజాయితీ పట్ల తమకు ఎప్పుడూ చెపుతూ ఉండేదన్నారు. అమ్మ నేడు ఉండి ఉంటే తన అభిమాన నాయకుడి వద్ద ఆమె కుమార్తెనైన నేను ఎమ్మెల్యేగా ఉండడం చూసి ఎంతో సంతోష పడేదంటూ ఉద్విగ్నానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. ఈ ఘటనతో సభ మొత్తం ఒక్కసారిగా సైలెంట్ అయింది.

దళితుల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం : ఎమ్మెల్యే సౌమ్య

దళితుల అభ్యున్నతి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా 27 పథకాలు అమలు చేస్తున్నట్టు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజావేదిక సభలో ఆమె మాట్లాడుతూ దళితుల ఆరాధ్యదైవం చంద్రబాబు అంటూ కొనియాడారు. బాలయోగి, ప్రతిభా భారతిలను స్పీకర్లుగా చేసి, దళితులను రాజకీయంగా ఉన్నతస్థాయికి తీసుకు వెళ్లారన్నారు. ఉపకులాలకు కూడా రిజర్వేషన్ ఫలాలు అందించాలని, ఆయన ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వటం దళితుల అదృష్టమన్నారు. వైసీపీ విధ్వంసానికి గురైన వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకంతో పాటుగా నియోజకవర్గంలో పలు సమస్యలను ప్రస్తావించి నిధులు కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ముప్పాళ్ల గ్రామం టీడీపీకి కంచుకోటగా ఉందని, ఎన్నికల్లో పార్టీకి 1600 ఓట్లు అత్యధిక మెజార్టీ ఇచ్చిన ముప్పాళ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. సుబాబుల్, మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రత్యేకంగా చొరవ చూపాలని కోరారు. పెద్దవరం గ్రామంలో ఏపీఐఐసీ ఆధీనంలో 500 ఎకరాల భూములు ఉన్నాయని, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తొమ్మిది నెలల కాలంలో నియోజకవర్గంలో రూ.వంద కోట్ల మేర అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. తాగునీటి పథకానికి, నందిగామ ప్రభుత్వఆస్పత్రి అప్‌గ్రేడ్ చేసి నిధులు కేటాయించినందుకు ఆమె సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాల సందర్శన

ముప్పాళ్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం పాఠశాలకు చెందిన తొమ్మి దవ తరగతి విద్యార్థినులు వెన్నెల, కార్తీకలతో ఆయన ముచ్చటించారు. వారిని వెంటబెట్టుకొని వెళ్లి పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేశారు. వసతి గదులను, స్టోర్‌రూమ్‌ను సందర్శించారు. పాఠశాల నిర్వహణ, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలసి టీ తాగిన చంద్రబాబు వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయలతో ఫొటోలు దిగారు. ముఖ్యమంత్రి విద్యార్థులు ఆనందంగా గడిపారు. సుమారు గంట పాటు ముఖ్యమంత్రి అక్కడే గడిపారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు



గురుకుల విద్యార్థినులను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వెనుకబడిన వర్గాల అభివృద్ధే పీ4 లక్ష్యం : ఎంపీ శివనాథ్

వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు విప్లవాత్మకమైన పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీ4 గురించి ఢిల్లీ స్థాయిలో అందరూ ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. దేశానికి మార్గదర్శకులైన నలుగురైదుగురు నాయకుల్లో చంద్రబాబు ఒకరని కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో టీడీపీ నడుస్తుందన్నారు. సామాజిక న్యాయం సీఎం ధ్యేయమన్నారు. చంద్రబాబు ఆలోచన 20 సంవత్సరాల ముందుంటుందనటానికి ఐటీ విప్లవం ఒక ఉదాహరణ అని చెప్పారు. హైదరాబాదులో ఐటీతో పాటుగా ఫార్మా రంగాన్ని, కన్‌స్ట్రక్షన్ పరిశ్రమను అభివృద్ధి చేసారని, ప్రత్యేకంగా స్పోర్ట్స్ విలేజ్ నిర్మించారని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో యువత సాఫ్ట్‌వేర్ రంగం వైపు అడుగులు వేయటానికి ఆనాటి చంద్రబాబు ఆలోచనే కారణమన్నారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న చంద్రబాబు నినాదం ఒక విప్లవం తీసుకువచ్చిందన్నారు. ప్రజలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తయారయ్యేందుకు ముందుకు అడుగులు వేస్తున్నారని చెప్పారు. వికసిత్ భారత్ కోసం ఒకవైపు ప్రధాన మంత్రి మోదీ, 2047 స్వర్ణాంధ్ర కోసం మరోవైపు చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఏపీకి ప్రత్యేకంగా ఏ బ్రాండ్ లేకపోయినప్పటికీ బ్రాండ్ సీబీఎన్ ఉందని గర్వంగా చెప్పుకుంటున్నట్టు చెప్పారు. నందిగామ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు.

ప్రజాబలం ఉన్నవాళ్లే నాయకులు

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు



జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబలం ఎవరికి ఉంటే వాళ్ళే నాయకులు, ప్రజాబలం లేకుండా ఏదైన చేద్దామనుకుంటే అది వారి భ్రమ అని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవనరామ్ జయంతి పురస్కరించుకొని తిరువూరులోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆ మహనీయుడి ఆశయ సాధన దిశగా కృషి చేయడమే మన ముందున్న కర్తవ్యం అన్నారు. జగజ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఎన్నో వివక్షతలు ఎదుర్కొంటూ ఉన్నత స్థాయికి చేరుకున్నారంటే, వారికున్న చదువు, విజ్ఞానం, ఆత్మగౌరవం, వారి మీద వారికి ఉన్న ఆత్మవిశ్వాసం వారిని ఉన్నత స్థానానికి చేర్చిందన్నారు. మన సొంత బలమే మనల్ని నిలబెడుతుందని, వెనుక ఎవరో నలుగురు ఉండి నువ్వు నాయకుడివి అంటే ఎవరూ నాయకుడు కాడు అంటూ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాయకుడు అనే వాడు స్వయంగా ఎదుగుతాడు, నాయకుడు అనే వాడు ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతాడు అని ఆయన పేర్కొన్నారు. తాను రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి ఆనంద్‌స్వరూప్, దుబ్బాకు వెంకటేశ్వరరావు, మార్కేండేశ్వరరావు, మీనుగు శ్రీనివాసరావు, సింధు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అహంకారం ఉంటే ప్రజలు దూరమవుతారు

- టీడీపీ నాయకుడు శావల దేవదత్
- ఎమ్మెల్యే కార్యక్రమానికి నాయకుల డుమ్మా!
- ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణ



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకుడు శావల దేవదత్, నాయకులు

తిరువూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు అహంకారపూరితంగా వ్యవహరిస్తే ప్రజలు దూరమవుతారని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ ఆథారిటీ ఛైర్మన్, టీడీపీ నాయకుడు శావల దేవదత్ అన్నారు. తిరువూరులో టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. శనివారం స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ(కూటమి)నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకను నిర్వహించడంతో పాటు, ఎస్సీ వర్గానికి చెందిన పార్టీ సీనియర్లను శాలువాలతో సన్మానించి, స్వీట్లు అందించారు. ఫ్యాక్టరీ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శావల దేవదత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పి4 పథకం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొందరు పదవి ఉంది కదా అని అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, పదవి ఒక బాధ్యతగా గుర్తించాలని హితవు పలికారు. ఎవ్వరైన అహంకార పూరితంగా వ్యవహరిస్తే ప్రజలు దూరమవుతారనే విషయం తెలుసుకోవాలన్నారు. అటువంటి వారి వెంట వెళ్లకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఇగోలు వద్దు

(5వ పేజీ తరువాయి)

నందిగామ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులకు ఆయన ర్యాంకులు కేటాయించారు. బూత్ కన్వీనర్ల ర్యాంకులు తగ్గటాన్ని ప్రశ్నించారు. తమను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయట్లేదని పలువురు బూత్ కన్వీనర్లు తెలిపారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. వైసీపీ నుంచి వచ్చిన వారికి సభ్యత్వాలు ఇస్తున్నారని, మళ్లీ వారే పదవుల కోసం పోటీలు పడుతున్నారని, ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తున్న తమకు ఇబ్బందికరంగా ఉంటోందని తెలిపారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ కార్యకర్తల మనోభావాల ప్రకారమే తనతో పాటు పార్టీ కూడా నడుచుకుంటుందన్నారు. మొదటి నుంచీ పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన వారికి ఎప్పుడూ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. నేటి మొదలు.. 2029 ఎన్నికలే లక్ష్యంగా అంతా పనిచేయాలని సూచించారు.

అహంకారమొద్దు.. సమన్వయంతో పనిచేయండి

అనంతరం చంద్రబాబు.. నందిగామ నియోజకవర్గం గురించి కొద్దిసేపు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల్లో కేవలం రెండుసార్లే ఇక్కడ పార్టీ ఓడిపోయిందని, మిగిలిన అన్నిసార్లూ విజయదుందుభి మోగించిందని తెలిపారు. ఆ రెండు సందర్భాల్లోనూ నాయకుల మధ్య సమన్వయం లేకపోవటమే కారణమని చెప్పారు. మనల్ని మనమే ఓడించుకోవటం జరిగిందే తప్ప.. బయటి వారు ఓడించలేదన్నారు. కాబట్టి నియోజకవర్గంలో అందరూ సమన్వయంతో, సమష్టిగా పనిచేయాలని సూచించారు. అహంకారం దరిచేరనివ్వొద్దన్నారు. ఇగోలతో ఉండే వారిని తాను ఉపేక్షించబోనన్నారు. ఈ ఐదేళ్లలో తాను 175 నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్, బూత్‌లవారీగా నాయకుల పనితీరుపై సమీక్షిస్తానని చెప్పారు. పార్టీ కోసం మంచి పనులు చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వటం ద్వారా తగిన గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ కోసం పనిచేయని వారిని పక్కన పెట్టేస్తానన్నారు. ప్రతి ఒక్కరిపై పర్యవేక్షణ ఉంటుందని, గెలిచే అభ్యర్థులకే సీట్లు ఇస్తామన్నారు. గెలవలేని వారిని నిర్దాక్షిణ్యంగా పక్కనపెడతామన్నారు. వచ్చే మహానాడు కడపలో జరుగుతుందని, భవిష్యత్తులో అక్కడ కూడా ఘన విజయం సాధిస్తామన్నారు. అధికారం వచ్చిందన్న ధీమాతో నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దీనివల్ల పార్టీకి నష్టం జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నేడు మనగుడి



అర్చకులకు పూజా సామగ్రి అందజేస్తున్న టీటీడీ అధికారి ప్రసాద్

లబ్బీపేట, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఎన్టీఆర్, కృష్ణాజిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నిర్మించిన ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ కృష్ణాజిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మనగుడి కార్యక్రమంలో భాగంగా పలు ఆలయాల అర్చకులకు పూజా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 16 ఆలయాల్లో మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి వచ్చిన కంకణాలు, కుంకుమ, గోవింద నామాలు, మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకం భక్తులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్రంట్ షాక్

(5వ పేజీ తరువాయి)

పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించినా స్పందన లేదు. ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని సరిచేయడానికి అధికారులకు రెండు రోజులు పట్టింది. రుద్రపాక సబ్‌స్టేషన్ నుంచి దండిగానపూడికి విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ లైన్లు పెద్ద చేపల చెరువులో ఉన్నాయి. గుడివాడ-పోలుకొండ రహదారి నుంచి దండిగానపూడి గ్రామంలోకి విద్యుత్ స్తంభాలు వేయాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. దీంతో ప్రస్తుతానికి కర్రల సహాయంలో 11 కేవీ విద్యుత్ లైన్లను లాగి దండిగానపూడి గ్రామానికి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దాదాపు అరకిలోమీటర్ మేర 11 కేవీ విద్యుత్ లైన్ చేపల చెరువులో ఉంది. చేపల చెరువు నిండుగా నీరు ఉండటంతో మరమ్మతులకు రెండు రోజుల సమయం పట్టింది.

పట్టించుకోని గ్రామస్తుల వినతి

పెద్ద చేపల చెరువు మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను తొలగించాలని పలుమార్లు గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. కర్రల స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకునే వారు కరువయ్యారు.

మరమ్మతులకు సమయం పట్టింది

దండిగానపూడి గ్రామానికి రోజున్నర పాటు విద్యుత్ అంతరాయం కలిగింది. చేపల చెరువులో కర్రల సహాయంతో 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండటంతో మరమ్మతులు చేయడానికి సమయం పట్టింది. చెరువులోని స్తంభాలను తొలగించి గ్రామ ప్రధాన రహదారి మీదుగా వేసేందుకు అంచనాలను తయారుచేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

– కృష్ణమాణిక్య వర్మ, ఏడీఏ గుడివాడ రూరల్

వరాల జల్లు

(5వ పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను పదేళ్ల పాటు అవుట్‌సోర్సింగ్ విధానంలో రైతు సంఘాలకు అప్పగించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అడిగిందే తడవుగా ఆయన వరాల జల్లు కురిపించారు. చందర్లపాడు మండలం ఏటూరు-కంచికచర్ల మండలం మోగులూరు గ్రామాల మధ్య రాకపోకల నిమిత్తం మునేటిపై కాజ్‌వే నిర్మాణం కోసం రూ.2.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో యేనుగుగడ్డ వాగుపై వంతెనలు నిర్మించేందుకు రూ.2.13 కోట్లు, కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద వాగులపై వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. సుబాబుల్, మిర్చి రైతుల సమస్యలు తనకు తెలుసని, మార్కెట్ పరిస్థితులను సమీక్షించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తానన్నారు. అమెరికా ఆంక్షలతో ఆక్వాకు దెబ్బతగిలే పరిస్థితి ఏర్పడిందని చెప్పిన ఆయన వారు ఏమాత్రం నష్టపోకుండా ఆదుకుంటామన్నారు. రైతులకు లాభసాటిగా ఉండేందుకు వ్యవసాయంలో సాంకేతికను జోడించేందుకు గేట్ ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు.

ముప్పాళ్ల అభివృద్ధికి హామీ

ముప్పాళ్లను అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించిన ఆయన వాటిని పరిష్కరించే బాధ్యత కలెక్టర్ లక్ష్మీశకు అప్పగించారు. 64 కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలు ఇస్తామన్నారు. 11 కుటుంబాలకు టాయిలెట్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. 223 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వటంతో పాటు పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. 909 కుటుంబాలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అయితే ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమ ఇంటిపై రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ అమర్చుకోవాలని చెప్పారు. ఇందుకోసం పైసా కూడా ఖర్చు కాదని, నిర్వహణ బాధ్యతలు కూడా ఏజెన్సీ సంస్థ చూస్తుందని, ఒకవేళ విద్యుత్ మిగిలితే యూనిట్‌కు రూ.2.09 వంతున తీసుకుంటామని, సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని చెప్పారు. బీసీ, ఓసీలు కూడా సోలార్ సిస్టమ్ బిగించుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవటం లాభదాయకమని, ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లు కూడా రీచార్జి చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది ముప్పాళ్ల గ్రామంలో 4 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు వేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నామని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

నీటి కష్టాలు

(5వ పేజీ తరువాయి)

పంచాయతీల ద్వారా నింపారు. ఇది జరిగి దాదాపు 40 రోజులు కావస్తుండటంతో పాటు వేసవిలో నీటి వినియోగం పెరిగి చెరువుల్లోని నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. 100కుపైగా చెరువుల్లో 50 శాతానికి నీటిమట్టం పడిపోగా, మిగిలిన 166 చెరువుల్లో 25 నుంచి 30 శాతమే నీరు అందుబాటులో ఉంది. దీంతో ఈ నెల 15 నుంచి ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రధాన కాల్వలకు తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని తాగునీటి చెరువులను నింపేందుకు ఏప్రిల్ నెలాఖరు వరకు 4 నుంచి 5 టీఎంసీల నీటిని ఆయా ప్రాంతాలకు విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు నీరు

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని 2.50 లక్షల మందికి, పెడన పురపాలక సంఘంలోని 35 వేల మందికి, మచిలీపట్నం సౌత్, నార్త్ మండలాల్లోని 75 వేల మందికి, గూడూరు మండలంలోని నాలుగైదు గ్రామాలకు తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. ఈ ట్యాంకు 180 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. నీటి సామర్థ్యం 5.60 మీటర్లు కాగా, ప్రస్తుతం 3.10 మీటర్లకు తగ్గింది. ఈ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు రోజులుగా ఈ ట్యాంకును నింపేందుకు ప్రకాశం బ్యారేజీ నుంచి బందరు కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు. కాల్వ ద్వారా వచ్చిన నీటిని కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో పెద్ద మోటార్ల ద్వారా చెరువుల్లోకి పంపే పనులు చేస్తున్నారు. గత ఏడాది ఎన్నికల సమయం కావడంతో తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటిమట్టం తగ్గి మచిలీపట్నం నగరంతో పాటు పెడన, మచిలీపట్నం మండలాలకు మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేయాల్సి వచ్చింది.

పంచాయతీల ద్వారానే చెరువులు నింపాలి

కాల్వలకు నీటిని విడుదల చేస్తే పంచాయతీల ద్వారా తాగునీటి చెరువులను నింపాల్సి ఉంది. జిల్లాలో 266 తాగునీటి చెరువులు ఉండగా, వాటిలో 18 మాత్రమే ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నింపుతామని, మిగిలిన అన్నింటినీ పంచాయతీల నిధులతోనే నింపాలని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది వేసవిలో కొన్ని పంచాయతీల్లోని కాల్వలకు గ్రావిటీ ద్వారా వచ్చిన నీటిని చెరువులను నింపి సరిపెట్టారు. విద్యుత్ మోటార్లు లేదా ఆయిల్ ఇంజన్లను ఏర్పాటుచేసి నీటిని పంపింగ్ చేయకపోవడంతో తీర ప్రాంతంలోని తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతోపాటు ఊర చెరువులను పూర్తిస్థాయిలో నింపకపోవడంతో గత వేసవిలో పశువులకు తాగునీరు అందుబాటులో లేక అల్లాడిపోయాయి. గత ఏడాది మచిలీపట్నం మండలంలోని కోన, పల్లెతుమ్మలపాలెం తదితర గ్రామాల్లోని చెరువులను నింపకుండానే సరిపెట్టేశారు. ఈ ఏడాది ఈ తరహా ఇబ్బందులు లేకుండా ముందుచూపుతో వ్యవహరించి పంచాయతీల ద్వారా తాగునీటి చెరువులను నింపేలా అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. వేసవిలో తాగునీటి అవసరాల కోసం విడుదల చేసే నీటిని చేపల చెరువులకు మళ్లించకుండా నిఘా బృందాలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాలి : మాజీ ఎమ్మెల్సీ కేఎస్

గన్నవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపైన ఉందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక రాయనగర్ కళ్యాణ మండపంలో ఆత్కూరు జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు మహేశ్వరీ దేవి పదవీ విరమణ సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై శనివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, సమిష్టి పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతా యన్నారు. అనంతరం ఉమామహేశ్వరీ, మా ణిక్యాలరావు దంపతులను దుశ్శాలువ, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, గుడివాడ డీవైఈవో కె.రవికుమార్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వర రావు, గన్నె వెంకట్రావు, ఎం.విజయ్‌కుమార్, కెఎస్ జగదీశ్వర రావు, వరప్రసాద్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీతో రైతులకు చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేద కూలీలకు పనికల్పించడంతో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉందని టీడీపీ అధ్యక్షుడు యనమదల వెంకయ్యారావు అన్నారు. మల్లవల్లి పెదచెరువు నీటి సప్లయ్ చానల్ పూడికతీత పనులకు శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కృష్ణాజీ, పరమేశ్వర రావు, ఎనెస్సీ-73 అధ్యక్షుడు తమ్మిశెట్టి రాము, పెదచెరువు అధ్యక్షుడు తూము సుబ్బారావు, శ్రీను, ఫీల్డ్‌అసిస్టెంట్ పంతం నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించొద్దు

కంకిపాడు, ఏప్రిల్ 5 (కంకిపాడు) : కంకిపాడు ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్సై డి. సందీప్ హెచ్చరించారు. కంకిపాడు సెంట ర్‌లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సమస్యలపై సూచనలు సలహాలు ఇచ్చారు. మోటార్ సైకిల్స్ తోలుతున్న మైనర్‌లకు లైసెన్స్ లేకుం డా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్సై 2 తాతాచార్యులు, ఏఎస్సై అనీల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

ఉయ్యూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అపన్నులను ఆదుకోవడానికి ముందుకు రావడం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు బోడె వెంకట్రామ్ అన్నారు. ఉయ్యూరుకు చెందిన ఇంటూరి యేసుపాదంకు బీవీఆర్ సౌజన్యంతో ట్రైసైకిల్ శనివారం అందచేశారు. నగర పంచాయతీ చైర్మన్ వి సత్యనారాయణ, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, చేదుర్తిపాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ మురళీకృష్ణకు సత్కారం

గన్నవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం అడ్మిన్ అడిషనల్ ఏఎస్పీ ఎన్‌బిఎం మురళీకృష్ణను చిలకపాటి శివశంకరరావు దుశ్శాలువ, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల తెలుగు సంవత్సర ఉగాది పుర స్కారాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మహో న్నత సేవా పథకం అందుకున్న ముర ళీకృష్ణ స్వగ్రామమైన దావాజీగూడెం శనివారం వచ్చారు. ఆయనను శివశంకరరావు మర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేశారు.



అడిషనల్ ఏఎస్పీ మురళీకృష్ణకు శాలువా కప్పి బొకే అందజేస్తున్న శంకరరావు

బంగారు మంగళసూత్రాల వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఈవో యార్లగడ్డ వాసు అన్నారు. కానుమోలులోని శ్రీసీతారామస్వామి ఆలయంలో నిర్వహించే శ్రీరామకల్యాణానికి ఆరుగొలను గ్రామస్తులు పెదర్ల అచ్యుత్‌రాం, సరిత దంపతులు బంగారు మంగళ సూత్రాలను శనివారం ఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు చింతల వెంకట శివఅప్పారావు, దన్నే దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మరకత లింగేశ్వరుడికి పూజలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు బ్రహ్మసూత్ర మరకత లింగ శివాలయంలో శనివారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, తమిరి రమేశ్ పర్యవేక్షించారు.

తోపుడు బండ్లు అందజేత

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేదవారికి ఉపాధిని పెంపొందించుకోవడానికి శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చేయూత ఇవ్వడం అభినందనీయమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు అన్నారు. శనివారం శ్రవంతి చారిటబుల్ ఆధ్వ ర్యంలో బాపులపాడు గ్రామంలో ఒక బడ్డీ, మూడు తోపుడు బండ్లు, ట్రై సైకిల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ అందజేశారు. కార్యక్ర మంలో ట్రస్ట్ కార్యదర్శి వీరమాచనేని శ్రీదేవి, కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేశ్, నాయకులు నూలు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సహజయోగంతో ఆరోగ్యం

ఉయ్యూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శారీరక మానసిక రుగ్మతలనుంచి విముక్తికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని సహజయోగ ట్రస్ట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ రామమోహనరావు అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్, సహజయోగా ట్రస్ట్ ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సహజయోగ ధ్యానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ ట్రస్ట్ సలహా దారు సాంబశివరావు, ఎస్ శంకర్, పీవీ గజేంద్రరావు, మహిళా కన్వీనర్ ఎం దుర్గ యోగా ఉపయోగాలు సూచించారు.

పాడిరైతుల్లో ఆత్మగౌరవాన్ని పెంచుతున్నాం

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు



బోనస్ చెక్కులు పంపిణీ చేస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గిట్టుబాటు ధరను అందించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాడిరైతుల్లో ఆత్మగౌరవాన్ని పెంచడానికి కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ మూడవ విడత ప్రకటించిన రూ.18 కోట్లు బోనస్ పంపిణీలో భాగంగా శనివారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు రూ.2.18కోట్లు బోనస్ చెక్కులను ఆయా సంఘ అధ్యక్షులకు చలసాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాడి రైతులకు మూడవ విడత బోనస్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. పాడి పశువులు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాననే న్యూనత భావం లేకుండా సగౌరవంగా పాడి రైతును నేను అని చెప్పుకునే విధంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో వారి కుటుంబాల్లో విద్యార్థులకు కూడా సహకారం అందించాలనే దిశగా యూనియన్ పాలకవర్గం ఆలోచన చేస్తుందన్నారు. రైతులు ఎక్కడ ఏ విషయం లోను ఇబ్బంది పడకుండ అన్ని విధాల సహకారం అందించడానికి కృషి చేస్తున్నామ న్నారు. నాణ్యమైన పాలను అందించడానికి ప్రతి రైతు కృషి చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని చలసాని విజ్ఞప్తి చేశారు. అత్యధిక బోనస్ సాధించిన సంఘాల అధ్యక్షులను చలసాని సత్కరించి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అన్వేశ్, ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నిమనేని లక్ష్మీప్రసాద్, శనగల వెంకట శివజ్యోతి జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎ.సీతారాంపురం గ్రామానికి చెందిన జంపన వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. టీడీపీ సభ్యత్వం కలిగిన ఆయనకు ప్రమాద బీమాగా రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంజూరు పత్రాలను మృతుని భార్య వెంకటేశ్వరమ్మకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, నక్కా ప్రసాద్, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వర రావు, మొవ్వా వేణుగోపాల్, గండేపూడి నితీష్‌కుమార్, లింగం శ్రీధర్, కొండపల్లి వెంకన్న, ఆర్నేపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులతో డైరెక్టర్ వీరమాచనేని శాంతి

కానూరు స్కాట్స్‌పైన్ విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన ఐఐఎంయూఎన్ కాన్ఫరెన్స్-2025కు ప్రాతినిధ్యం వహించి, కానూరు స్కాట్స్‌పైన్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలను సృష్టించుకోవడం, నాయకత్వ లక్షణాలను అలవరచుకోవడం, దౌత్య నైపుణ్యాలను పెంపొందించుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మాజీ యూకే అంబాసిడర్ రుచి ఘనశ్యాం, పారుల్ విశ్వవిద్యాలయం డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ పవన్ ద్వివేది, రవీంద్ర భారతి విద్యాసంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ ప్రతిమ పాల్గొన్నారు.

నైటింగేల్ స్ఫూర్తితో నర్సింగ్‌లో రాణించాలి

గన్నవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నైటింగేల్ స్ఫూర్తితో నర్సింగ్‌వృత్తిలో రాణించాలని ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ కె.సుశీల అన్నారు. నర్సింగ్ విద్యకు మంచి భవిష్యత్ ఉందని రోగులకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో శనివారం ల్యాంప్ లైటింగ్ సెరమని కార్యక్రమం ప్రిన్సిపాల్ జె.వందన అధ్యక్షతన జరిగింది. మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రోగులకు చిరునవ్వుతో సేవలందించాలని చెప్పారు. రోగులతో డాక్టర్‌ల కన్న నర్సులకే ఎక్కువ సత్సంబంధాలు ఉంటాయని చెప్పారు. కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్ మాట్లాడుతూ, మంచి కోర్సును ఎంచు కున్నారని చెప్పారు. విద్యార్థులు చేసిన స్కిట్లు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీమేశ్వర్, మెడికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.కళ్యాణి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ల పోరాటం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ విధ్వంసకర పాలనలో నీరు-చెట్టు బకాయిలను రాబట్టేందుకు రైతులకు అండగా నిలచి ఆళ్ల గోపాలకృష్ణ చేసిన పోరాటం, రైతులకు అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో శుక్రవారం రాత్రి నిర్వ హించిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల, పశుపాల ప్రదర్శన ముగింపు సమావే శంలో రాష్ట్రస్థాయిలో సేవలందించిన పలువురు రైతు నాయకులను ఘనంగా సత్కరించారు. దీనిలో భాగంగా ఆళ్ల గోపాలకృష్ణను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఘనంగా సత్కరించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

పెనమలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడ్డ దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు అత్యంత విలువైనవని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, యువనేత బోడె వెంకట్రామ్ పేర్కొన్నారు. శనివారం తాడిగడప వందడుగుల రోడ్డు సెంటర్లో జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా జరిగిన జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముళ్లపూడి ఉపేంద్ర పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, తాతపూడి గణేష్, యార్లగడ్డ సుచిత్ర, తుమ్మల రాంకుమార్, సూదిమళ్ల రవీంద్ర, మన్నే రాజబాబు, శౌంతి శివరాంప్రసాద్, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, మేడసాని రత్నకుమారి, విజయేంద్ర, మంచినేని పరమేష్, వణుకూరు మహేష్, బొంగరాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఉయ్యూరు జగ్జీవన్‌రామ్ నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు బోడె వెంకట్రామ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో, కలవపాముల, గండిగుంట, ఆకునూరు, కడవకొల్లు, కాటూరు తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

కంకిపాడు : బాబూ జగ్జీవన్‌రామ్ త్యాగాలు మరువలేనవని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పులి కామేశ్వరరావు, బత్తుల కామేశ్వరరావు, రవీంద్ర, యలమంచిలి కిషోర్, పులి శ్రీనివాసరావు, చలవాది రాజా, జయ, వణుకూరు విక్రం, గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, శ్యామ్, కాకుమాను రమేష్, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. ఉప్పలూరులో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, పడవల మధుసూదనరావు, రాధాకృష్ణమూర్తి, కొండవీటి శివయ్య, లాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : సమసమాజ స్థాపన కోసం జీవితమంతా కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి ప్రదాత అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ అన్నారు. భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం దేశ స్వాతంత్ర్య దేశం కోసం పోరాడిన ఆదర్శ నేత జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గౌరవ అధ్యక్షలు తిరివీధి వెంకయ్య, టిఎస్ఆర్‌కె ప్రసాద్, బి.కోటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, దేవరపల్లి విక్టర్‌బాబు, పోలిమెట్ల జయరాజు, దేవరపల్లి ఏసుబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తాడిగడప, గన్నవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఘన నివాళులు

విజయవాడ రూరల్ : నున్నలో శనివారం మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా జరిగింది. స్థానిక కోటగట్టు సెంటర్‌లో తెలుగుదేశం, ఎమ్మార్పీఎస్ నేతలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలకోటి శ్రీనివాసరెడ్డి, బొకినాల తిరుపతిరావు, తగరం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు అన్నారు. శనివారం మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని జంక్షన్‌లో పలుచోట్ల నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, ఎమ్మార్పీస్ నాయకులు అయినంపూడి ఆశీర్వాదం, పింగళి జోజి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు దేశ ఉప ప్రధానిగా దేశాభ్యున్నతికి కృషి చేసిన జాతీయ దృక్పథం కలిగి అభ్యుదయవాది బాబూ జగ్జీవన్‌రాం అని సర్పంచ్ పిల్లా అనిత, కాటూరు విజయభాస్కర్ కొనియాడారు. బొమ్ములూరు, వీరవల్లిలో శనివారం బాబూ జగ్జీవన్‌రాం 117వ జయంతి సం దర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరంకిలో నేడు నవమి ఉత్సవాలు

పెనమలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భక్తులకు అందుబాటులోకి వచ్చిన పోరంకి కోదండరామస్వామి ఆలయంలో నేడు శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరగనున్నాయి. ఆర్ష విద్యాభూషణ-ఆగమవాచస్పతి డాక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు, శ్రీరామ కల్యాణోత్సవాలు వేడుకగా జరగనున్నాయి.

మే 1 నుంచి ఉద్యోగుల చైతన్య యాత్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాల్సిందేనన్న డిమాండ్‌తో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుంచి ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులందరూ ఏకం కావాలన్న పిలుపుతో ఉద్యోగుల చైతన్య యాత్ర జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ పఠాన్, కార్యదర్శి కడిమి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గాల సహకారంతో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 20 జిల్లాల్లో సుమారు వెయ్యి కిలోమీటర్లు మూడు విడతలుగా చైతన్య యాత్ర జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల కలెక్టరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాలు ఇస్తారన్నారు. మే డేన తిరుపతిలో చైతన్య యాత్ర ప్రారంభమవుతుందన్నారు. సీపీఎస్ ఉద్యోగులను కలిసి సీపీఎస్ ఉద్యోగులు ఏ విధంగా నష్టపోతున్నారో పాత పెన్షన్ విధానంలో ఏ సౌకర్యాలున్నాయి, ఇటీవల ప్రభుత్వాలు తీసుకువచ్చిన గవర్నమెంట్ పెన్షన్ స్కీమ్, యూనియన్ పెన్షన్ స్కీమ్ వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. సెప్టెంబరు 1న పెన్షన్ మార్చ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.వి. జనార్దన్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. శాంతిబాయి, ఆర్థిక కార్యదర్శి జహీర్ అబ్బాస్, సహ అధ్యక్షుడు కిరణ్ ఉన్నారు.

మహిళల వ్యాపారాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● వర్క్‌షాపులో మంత్రి నారాయణ



మెప్మా చేపట్టిన 2025-26 కార్యాచరణ ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల ద్వారా మహిళల వ్యాపారాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు చేపట్టిందని, అందులో భాగంగానే మెప్మా 2025-26 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక చేపట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని బందరు రోడ్డులో ఉన్న అమరావతి కన్వెన్షన్ హాల్లో మహిళా వ్యాపారాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు జరిగింది. మంత్రి నారాయణ ప్రారంభించారు. కేంద్ర మాజీమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి నారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. నంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని 30వేల మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఏడాది 80 వేల సంఘాలకు రూ.8 వేల కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా పట్టణ పేద కుటుంబాలకు అందించే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినట్టు తెలిపారు. అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.143.55 కోట్లు, పీఎం స్వానిధి ద్వారా మంజూరైన రూ.2.21 కోట్ల రుణాల మెగా చెక్‌ను మంత్రి నారాయణ చేతుల మీదుగా ఎస్సీ లబ్ధిదారులకు అందించారు. ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రశంస అండ్ ఎక్సలెన్స్ పత్రాలు అందజేశారు. స్వయం సహాయక సంఘ మహిళల కోసం మెప్మా అధికారిక వెబ్‌సైట్, మహిళాకాశం యాప్, పట్టణ నిరాశ్రయుల వసతి గృహం కోసం నివాసం యాప్, సంఘాల్లోని లోన్ సదుపాయం కోసం మెప్మా లోన్ చార్జి క్రియేషన్ మెకానిజం (ఎంఎల్‌సీసీ), మెప్మా సిబ్బంది కోసం హెచ్ఆర్ఎంఎస్ డాష్ బోర్డులను ప్రారంభించారు. అనంతరం ఎంఏ అండ్ యూడీ శాఖ ప్రధాన కార్యదర్శి సమక్షంలో అసంఘటిత రంగాల కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పథకంతో అనుసంధానం చేస్తూ, వారికి ఆర్థిక భద్రత కల్పించేందుకు మెప్మా, కార్మిక శాఖల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పారిశ్రామికవేత్తల వార్షిక ప్రణాళికను ప్రారంభించారు. మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టనున్న వినూత్న కార్యక్రమాలు ఈ-కామర్స్ ప్రమోషన్ పాలసీ, ఈఏపీ వర్టికల్, డిజిటల్ ఇనిషియేటివ్స్, పరిపాలనా సంస్కరణలు-ఆర్థిక విషయాలు, సీబీ-ఐబీ వర్టికల్, ప్రత్యేక ప్రాజెక్టులు, సామాజిక మౌలిక సదుపాయాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు, మిషన్ డైరెక్టర్ (మెప్మా) ఎన్.తేజ్ భరత్, జాయింట్ డైరెక్టర్ ఐ.మాధవి, ఉన్నతాధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్లు, స్వయం సహాయక మహిళలు, స్టేట్ మిషన్ మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడకు రానున్న ఉద్యోగావకాశాలు: ఎంపీ చిన్ని


స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న శివనాథ్, బొండా ఉమా

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విజయవాడకు ఎన్నో ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఏ దేశం ఆలోచించని విధంగా క్వాంటమ్ కంప్యూటరైజేషన్ గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమెరికాలో మాత్రమే క్వాంటమ్ కంప్యూటరింగ్ ఉందన్నారు. తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ స్టూడెంట్ హోమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శారద కళాశాలలో 250 మంది విద్యార్థులకు శనివారం సాయంత్రం స్కాలర్‌షిప్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధనకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఎంపీ చిన్నిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ జంధ్యాల శంకర్ అధ్యక్షతన ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.ఈశ్వర్, ఎం సత్యనారాయణరావు, కార్యదర్శి జీవీఎస్ఎన్. రాఘవరావు, కోశాధికారి మోగులూరు కృష్ణ, కార్యవర్గ సభ్యులు యాబలూరు లోకనాథ శర్మ, జీవీఎస్ చలపతిరావు, బలరామకృష్ణమూర్తి, రామనారాయణ పాల్గొన్నారు.


దుర్గమ్మ పుష్పార్చనకు పుష్పాలు తీసుకెళుతున్న భక్తులు, ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చన

దుర్గమ్మకు ప్రత్యేక పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గాదేవికి చైత్ర మాస వసంత నవరాత్రుల క్రమంలో శనివారం అమ్మవారికి ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరులు, సన్నజాజులతో లలిత సహస్రనామాన్ని అనుసంధానించి పూజలు చేశారు. దుర్గగుడిలో వసంత నవరాత్రుల్లో అమ్మవారికి రోజుకొక రకం పుష్పాలతో అర్చన చేయటం జరుగుతోంది. ఉగాది పండుగనాడు ప్రారంభించిన ఈ ప్రత్యేక పుష్పార్చన శనివారం నాటికి ఏడు రోజులు పూర్తయ్యింది. పద్మాలలో ఆశీనురాలైన లక్ష్మీదేవి స్వరూపం కూడా దుర్గాదేవియేనని పూజలు చేస్తారు. దివ్యారత్నాభరణ భూషిత అయిన దుర్గమ్మ వరదాభయ హస్తంతో భక్తులను నిత్యం దీవిస్తుంటారు. మహాదేవి, మహేశ్వరి, నిత్యానందకరి అయిన మహాలక్ష్మి రూపం దుర్గాదేవి అని చెప్పడానికి దుర్గగుడిలో ముఖ్య ఆలయం చుట్టూ అష్ట లక్ష్మీదేవిల విగ్రహాలుంటాయి. ఈ అష్టలక్ష్మీదేవిలకు కూడా నిత్యం అలంకారం, అర్చన, తదితరాలను నిర్వహిస్తుంటారు. చైత్రమాస వసంత నవరాత్రుల్లో శనివారం అష్టమి తిథి రావటంతో ప్రాముఖ్యత ఏర్పడింది. అష్టమి నాడే దుర్గమ్మ జనించారని ప్రతీతి. పంచభూతాత్మిక అయిన దుర్గమ్మను భక్తులు తమ మనోఫలకాల్లో నిలుపుకుని సన్నజాజులు, కలువలు, ఎర్రగన్నేరు, ఎర్ర తామర పూలను సమర్పించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు

ఇంద్రకీలాద్రికి క్షేత్ర పాలకుడుగా ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. శ్రీరామనవమికి ముందురోజు ఆంజనేయ స్వామికి ప్రత్యేకంగా తమలపాకులతో అర్చన చేయటం జరుగుతుంది. దుర్గమ్మ ప్రధాన ఆలయం ఎదురుగా ఓ చిన్న మందిరంలో ఆంజనేయ స్వామి కొలువై ఉన్నారు. అలాగే ఘాట్ రోడ్డులోని మెట్ల మార్గం వద్ద, మహామండపం మెట్ల మార్గం వద్ద ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. ఈ అన్నింటా శనివారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి తమలపాకులతో పూజలు చేశారు. తమలపాకులను నాగవల్లీదళాలని పిలుస్తారు. స్వామికి నాగవల్లీ దళాలతో పాటు, ఆయనకు అత్యంత ఇష్టమైన అరిసెల దండలను సమర్పించారు. అర్చనకు ముందు స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలలో భక్తులు పాల్గొని స్వామివారిని తమ ఇష్ట కామ్యాలు సిద్ధించాలని కోరుకున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్

అడుగుజాడల్లో నడుద్దాం

● కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమతావాదానికి పునాది వేసి ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన బాబూ జగ్జీవన్‌రామ్ పలువురికి స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగుజాడల్లో అందరూ నిలవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా గుప్తాసెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ బాలాజీ, మాజీ ఎంపీ, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మలకాపట్నంలోని సమీకృత వసతిగృహంలోని చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిదశలో చిన్నప్పుడే తండ్రి చనిపోయి ఆర్థిక ఇబ్బందులకు గురైన జగ్జీవన్‌రామ్ పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కుమార్తె మీనాకుమారి స్పీకర్‌గా ఉన్న సమయంలో తాను ఎంపీ గా పార్లమెంటులో సేవలందించానన్నారు. డీఆర్వో చంద్రశేఖర్ మాట్లాడుతూ వసతి గృహాల అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు చేశారన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ ఇన్‌చార్జి అధికారి ముదిగొండ ఫణిధూర్జటి ఆధ్వర్యంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, ఎస్సీ సంఘాల నేతలు మాచవరపు ఆదినారాయణ, కొడాలి శర్మ, డొక్కా జగన్‌మోహనరావు, గంధ్రపు సీనయ్య, వంపుగడల చౌదరి, వి. కొండయ్య, గుమ్మడి విద్యాసాగర్, కొడాలి అజయ్‌కుమార్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు. అలాగే జడ్పీ సమావేశపు హాలులో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ రాగయుక్తంగా సీస పద్యం పాడి వినిపించారు. కలెక్టర్ బాలాజీ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, లింగం ఫిలిప్, రత్నం మాట్లాడారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి మరోసారి పరీక్ష

● పక్షం రోజుల్లో అమరావతికి నిపుణుల బృందం

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టనున్న సచివాలయ టవర్ల నిర్మాణ పనులకు టెండర్ల దశకు వెళ్తున్న సమయంలో మరోమారు ఐఐటీ నిపుణులతో పరీక్షలు చేయించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. రాజధానిలో నిర్మించబోయేది గ్రాండ్ ఐకానిక్ భవనాలు కావటంతో టెండర్లకు వెళ్లే ముందు ఈ ప్రక్రియ పూర్తి చేయాలనుకుంటున్నారు. గతంలో ఐఐటీ నిపుణులు వచ్చినపుడు ఇవి పూర్తిగా నీటితో ఉన్నాయి. ప్రస్తుతం నీటి తోడివేత పనులు పూర్తయ్యాయి. దీంతో మరోమారు పరిశీలించాలని నిర్ణయించారు. పక్షం రోజుల్లో వారు అమరావతి వచ్చి తుది పరీక్షలు జరపనున్నారు. ఈ టవర్లకు సంబంధించి 4 చోట్ల తుది పరీక్షలు నిర్వహిస్తారు. బేస్‌మెంట్ స్టీల్, బేస్‌మెంట్ కాంక్రీట్ ఎలా ఉందన్నది పరిశీలిస్తారు. గత పరీక్షల్లో నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బంది లేదని ఐఐటీ నిపుణుల బృందం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో నీరుండటంతో బేస్‌మెంట్ స్టడీ చేయలేదు.

50 శాతం పెరగనున్న అంచనా వ్యయం

అత్యంత భారీ హైరైజ్ టవర్ల పనులకు 50శాతం అదనంగా అంచనా వ్యయం పెరగనుంది. వైసీపీ హయాంలో ఐదేళ్లలో ఈ టవర్ల పనులను గాలికొదిలేయటంతో స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు (ఎస్ఎస్ఆర్) పెరిగిపోయాయి. ఐకానిక్ టవర్లకు పెద్ద మొత్తంలో స్టీల్ ఉపయోగించాల్సి రావటంతో పెరిగిన ధరల ప్రకారం అంచనాల కంటే 50శాతం అదనంగా ఖర్చు కానుంది.

అన్నీ అపోహలే..

సచివాలయాల టవర్ల దగ్గర నీరు తోడినప్పటికీ ఇంకా కొద్దిగా నీరుండటంతో సోషల్ మీడియాలో వస్తున్న అనుమానాలు అపోహలేనని సీఆర్‌డీఏ వర్గాలు స్పష్టం చేశాయి. నీటి తోడివేత సందర్భంలో పైపులైన్ లీకేజీ కారణంగా ఈ నీరు వచ్చిందే తప్ప మరొకటి కాదన్నారు. హైకోర్టు వద్ద మాత్రమే స్వల్పంగా ఊట వచ్చినా నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బందులు లేవని సూపర్‌వైజింగ్ సిబ్బంది చెబుతున్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ సేవలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వజ్రా జ్యోతి పేర్కొన్నారు. ఆసుపత్రి సౌజన్యంతో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్‌లో సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈఎస్ఐ, రమేష్, కామినేని, అమరావతి కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు వైద్య సేవలందించారు. యూనియన్ విజయవాడ అధ్యక్షుడు చావా రవి, ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పూజారి రాజేష్, ఐజేయూ జాతీయ సమితి సభ్యుడు షేక్ బాబు, యూనియన్ విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ కోసం గ్రామాల ఎఫ్ఎంబీల సేకరణ

● ఐదు జిల్లాల్లో రెవెన్యూ శాఖ నుంచి ఎఫ్ఎంబీల సేకరణ

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను గ్రౌండ్ ఫిక్సేషన్ చేయటానికి వీలుగా జాతీయ రహదారి సంస్థ అధికారులు గ్రామాల ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్స్ (ఎఫ్ఎంబీ) కాపీలను సేకరిస్తున్నారు. ఈ రోడ్డు వెడల్పు ఎంతనే దానిపై ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులకు స్పష్టత రాకపోవటంతో ముందస్తుగా ఎఫ్ఎంబీల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కోరినట్టుగా 150 మీటర్లు కానీ, 140 మీటర్లు కానీ ఇస్తే అందుకనుగుణంగా భూములను పెగ్ మార్కింగ్ చేయటానికి వీలుగా ఐదు జిల్లాల రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌హెచ్ అధికారులు ఎఫ్ఎంబీలు సేకరిస్తున్నారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు 140 మీటర్ల మేరకు ప్రాథమికంగా అనుమతులిచ్చినట్టుగా ప్రచారం జరుగుతున్నా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు) నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. మోర్తు నుంచి వచ్చే మినిట్స్ కోసం అమరావతి ఎన్‌హెచ్ అధికారులు ఎదురుచూస్తున్నారు. మినిట్స్ వస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 140 మీటర్లకు అనుమతినిస్తే ఎలా అన్నది తెలియాల్సి ఉంది. 70 మీటర్లు కేంద్రం, 70 మీటర్లు రాష్ట్రం భూసేకరణ వ్యయం భరించేలా ఉంటుందా..? మరో రకంగా ఉంటుందా..? అనేది వేచి చూడాలి. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు 70 మీటర్లకు అనుగుణంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేసుకున్నారు. ఒకవేళ అదనంగా 70 మీటర్లు ఇస్తే దానికి అనుగుణంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేసుకోవటానికి వీలుగా ఎఫ్ఎంబీలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 70 మీటర్ల ప్రాతిపదికన చూస్తే 1,300 హెక్టార్ల భూములు అవసరమవుతాయి. ఎన్‌హెచ్ రెండున్నర రెట్ల పరిహారం ఇవ్వనుంది కాబట్టి సుమారు రూ.2,600 కోట్లు ఖర్చవుతుంది. అదే 140 కిలోమీటర్లకు అనుమతిస్తే మరో రూ.2,600 కోట్లు అవుతుంది. అదనంగా ఇచ్చే 70 మీటర్ల భూసేకరణ వ్యయం కేంద్రమే ఖర్చు చేయాలనుకుంటే మాత్రం ఒక్క భూసేకరణకే రూ.5,200 కోట్లు ఖర్చవుతుందని తెలుస్తోంది. కేంద్రం నుంచి మినిట్స్ బుక్ వచ్చే వరకు వేచి చూడాలని ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు భావిస్తున్నారు.

సమయస్ఫూర్తితో మహిళను కాపాడిన సీఐ


వాటర్ ట్యాంకు ఎక్కిన మహిళతో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

చల్లపల్లి, ఏప్రియల్ 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలు, మానసిక ఆందోళనతో ఓ మహిళ వాటర్ ట్యాంకు ఎక్కి దూకేందుకు ప్రయత్నించగా స్థానిక యువత సహాయంతో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సమయస్ఫూర్తితో వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడారు. స్థానిక నారాయణరావునగర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన కొద్దిసేపు ప్రజలందరికీ హైటెన్షన్‌ను కలిగించింది. పుట్టింటి వద్ద ఉన్న ఓ మహిళ మధ్యాహ్నం కాలనీలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఏడుస్తూ ఉండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో చెంబురెడ్డి మణి, తుళ్లూరు విష్ణుభరత్ తదితర యువకులు ట్యాంకు ఎక్కి మహిళకు దించేందుకు ప్రయత్నించినా రాలేదు. తండ్రి వచ్చి కోరినా రాలేదు. సమాచారం అందుకున్న సీఐ ఈశ్వరరావు అక్కడకు వచ్చిన ట్యాంకు ఎక్కి సమస్యలుంటే చెప్పాలంటూ మాటల్లో పెట్టారు. అయినప్పటికీ ట్యాంకు అంచున కాళ్లు కిందకు వేలాడేసి కూర్చుండిపోయింది. భర్త నెంబరు చెబితే ఫోన్ చేస్తామంటూ అక్కడే ఉన్న మణి అనే యువకుడికి డైరెక్షన్ ఇవ్వటంతో మణి చాకచక్యంగా ట్యాంకు చుట్టూ తిరిగివెళ్లి మహిళను గట్టిగా పట్టుకుని వెనక్కులాగేశాడు. దీంతో ట్యాంకు పైకివెళ్లిన వారంతా ఇవతలకు తీసుకురాగా, సీఐ ఈశ్వరరావు జాగ్రత్తగా కిందకు దింపి తండ్రికి అప్పగించారు. ధైర్యంగా ముందుకువచ్చిన యువకుడు మణిని సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం అభినందించారు. సీఐ ఈశ్వరరావు సమయస్ఫూర్తితో మహిళను కాపాడటంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఒకవేళ మహిళ కిందపడితే ప్రమాదం జరగకుండా ఉండేలా స్థానికులందరూ కలిసి పెద్దపరజాలను పట్టుకోగా, సన్‌షైడ్ మాదిరిగా ఉన్న శ్లాబ్ భాగంలోని ఇనుప సువ్వలను వంచి అప్రమత్తం చేశారు. అదృష్టవశాత్తూ మహిళను సురక్షితంగా తీసుకువచ్చారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప సంఘసంస్కర్త, రాజకీయవేత్త బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పేదవర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, విలువలతో కూడిన రాజకీయ జీవితం గడిపారన్నారు. సమాజంలో అంటరానితనం, కులవివక్షను రూపుమాపేందుకు కృషి చేశారని, ఆ స్ఫూర్తితో దేశాభివృద్ధికి యువత కృషిచేయాలన్నారు.

నగరంలో 'జాక్' సందడి



లబ్బీపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో జాక్ మూవీ టీమ్ సందడి చేసింది. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మూవీ ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. చిత్ర కథనాయకుడు సిద్దూ జొన్నలగడ్డ మాట్లాడుతూ విజయవాడ రావడం సంతోషంగా ఉందని, జాక్ చిత్రంలో కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు పుష్కలంగా ఉన్నాయని, హీరోయిన్ వైష్ణవి చైతన్య వేసే పంచులు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. టిల్లు క్యూబ్, తెలుసు కదాతో త్వరలో ప్రేక్షకుల ముందుకి వస్తానన్నారు. హీరోయిన్ వైష్ణ వి చైతన్య మాట్లాడుతూ హీరో సిద్దూ జొన్నలగడ్డతో కలిసి నటించ డం సంతోషంగా ఉందని, జాక్ స్టోరీ డిఫరెంట్‌గా ఉంటుందన్నారు. చిత్ర నిర్మాత బీవీఎస్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ సినిమా ఖచ్చితంగా మంచి కలెక్షన్స్ అందుకోబోతుందన్నారు. పవన్ క ల్యాణ్ డేట్స్ ఇస్తే ఖచ్చితంగా ఆయనతోనూ చిత్రాన్ని తీస్తామన్నారు.


గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

80 కేజీల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు

ఆటోనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శివారు ప్రాంతమైన ఎనికేపాడు వద్ద 80 కేజీల గంజాయి, పుంగనూరుకు చెందిన ఇద్దరు నిందితుల్ని పటమట పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వల్లభనేని పవన్ కిషోర్ మాట్లాడుతూ షేక్ షాజిద్, షేక్ ఫయాజ్ వైజాగ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి బొలేరో వాహనంలో బెంగుళూరు తరలిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ కె. దామోదర్ పర్యవేక్షణలో ఎస్.ఐ హరికృష్ణ వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు కారును పక్కన ఆపి పారిపోయేందుకు యత్నించారన్నారు. ఎస్.ఐ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. వాహనాన్ని, 80 కేజీల గంజాయిని సీజ్ చేసి నిందితుల్ని రిమాండ్‌కు తరలిచినట్టు వెల్లడించారు. ఎస్.ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించండి

● కర్ణాటక ప్రభుత్వానికి మహ్మద్ గౌస్ పీర్ విజ్ఞప్తి



కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు బయలుదేరు ఆంధ్రప్రదేశ్ హాజీలకు కర్ణాటక ప్రభుత్వం ద్వారా వసతి, సౌకర్యాలు కల్పించాలంటూ కర్ణాటక మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సల్మా ఫాతిమాను ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వాహక అధికారి మహ్మద్ గౌస్ పీర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు శనివారం బెంగళూరులోని వికాస్ సౌధాలో కర్ణాటక మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా సల్మా ఫాతిమాను కలిశారు. బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా 454మంది ఏపీకి చెందిన హజ్ యాత్రికులు హజ్ యాత్రకు వెళ్లనున్నారు. గౌస్ పీర్ అభ్యర్థనను మన్నించిన సల్మా యాత్రికులకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని, ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించండి

● సీఎస్‌ను కలిసిన కేయూ ఉప కులపతి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్‌ను కేయూ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ కోరారు. శనివారం వెలగపూడి సచివాలయంలో విజయానంద్‌ను ఆయన కలిసి పూలమొక్కను ఇచ్చి సత్కరించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి చెందిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టుకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సులో చేరే విద్యార్థులకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ సెట్ 2025కు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులతో పాటు డిగ్రీ ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అవకాశం కల్పించామన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో ఎంఏ ఇంగ్లీషులో 33, ఎంకాంలో 44, ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40, ఎంఎస్‌ఈ అనాలిటికల్ కెమిస్ట్రీలో 40, గణితశాస్త్రంలో 33, ఎంఎస్‌ఈ భౌతికశాస్త్రంలో 33, ఎంఎస్‌ఈ బోటనీలో 33, ఎంఎస్‌ఈ జుయాలజీలో 33, ఎంఎస్‌ఈ బయోటెక్నాలజీలో 33, ఎంబీఏలో 66, ఎంసీఏలో 66 సీట్లు ఉన్నాయన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. ఇందుకు కేయులో సమాచార కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

ప్రజలకు ఎంపీ చిన్ని శ్రీరామనవమి శుభాకాంక్షలు

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఒంటిమిట్ట, భద్రాది ఆలయాలతో పాటు ప్రతి ఇంట శ్రీరామనవమి పర్వదినాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440



దళితవాడలో శ్రీరాముల విగ్రహ ప్రతిష్ఠ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు దళితవాడలో రామాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. ఎలిసిన ఆంజనేయులు, లక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

రహదారుల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

గుడివాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు అభివృద్ధికి రూ.2.50కోట్లు, గుడ్లవల్లేరు-ముదినేపల్లి రహదారి నిర్మాణానికి రూ.2.50కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎనిమిది నెలల్లో కూటమి ప్రభుత్వం 57.98 కిలోమీటర్ మేర రూ.21.93కోట్లుతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.

మూడో రోజుకు చేరిన సంతకాల సేకరణ

గుడివాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ కళాశాల రోడ్డులోని రైల్వేగేటు విస్తరణకు భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వై.వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ శనివారం మూడో రోజుకు చేరుకుంది. కేటీఆర్ కళాశాల రైల్వేగేటు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రైల్వేగేటు వెడల్పుతో పాటు ఐఎంఏ హాల్ రోడ్డును అభివృద్ధి చేయాలని, చింతల కాల్వకు ఇరువైపులా ఉన్న రహదారులను అభివృద్ధి చేసి అరవపేట, మందపాడు గేటుల మీదగా ట్రాఫిక్ మళ్లించాలని ఆయన కోరారు. సంతకాల సేకరణలో సభ్యులు మహ్మమద్ తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావు, మహ్మమద్ అక్బర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్ దోనేపూడికి అభినందనలు

కూచిపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన దోనేపూడి శివరామయ్యను మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది శనివారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి షేక్ అక్బర్ బాషా, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ మొవ్వ మండల శాఖ అధ్యక్షుడు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సిబ్బంది దోనేపూడిని క లసి అభినందించిన వారిలో ఉన్నారు.

అప్పికట్లలో ఉచిత వైద్యశిబిరం

పెదపారుపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అప్పికట్ల గ్రామంలో కొడాలి సూర్య ప్రకాశరావు వితరణతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 15 మంది గుండె, నరములు, ఎముకలు, స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధించి చికిత్స చేయించుకున్నారు. వైద్యులను మానవతా శాఖ సత్కరించింది. గుడివాడ మానవతా శాఖ ప్రథమ అధ్యక్షుడు గుత్తా రమేష్, గుడివాడ మానవతాశాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కార్యదర్శి నందమూరి పద్మజ, ట్రెజరర్ చంద్రశేఖర్, సభ్యులు రాధ, లక్ష్మయ్య, కూచిపూడి వాసుదేవరావు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ గ్రాడ్యుయేషన్ డే

గుడివాడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.వి.కె.సుమంత్ ప్రశంసాపత్రాలు, సర్టిఫికేట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కో-ఆర్డినేటర్ సరళ, ఏవో చనుమోలు జయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో సీసీ రోడ్డు ప్రారంభం

పామర్రు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పల్లెపండుగలో భాగంగా పామర్రులో డీఎంఎఫ్‌టీ నిధులు రూ20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని విస్మరించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటి వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, అల్లంశెట్టి సురేష్, ఈవోపీఆర్డీ కిషోర్, ఏపీవో సురేష్, పీఆర్ ఏఈ రామారావు తదితరులు పల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు

పామర్రు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అంకమ్మతల్లి ఆలయంలో వేంచేసి యున్న రేణుకా పరమేశ్వరస్వామివార్లకు శనివారం పంచామృతాభిషేకం, బిల్వ దళం, సుగంధ ద్రవ్యాలతో విశే ష పుష్పార్చన, అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. 13వ వార్డు సభ్యురాలు అల్లంశెట్టి లావణ్య, పవన్ దంపతులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన జరిపారు. ఆలయ నిర్వహకులు వరదా అప్పారావు, సభ్యులు మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



ఉండ్రపూడి ఆలయంలో శ్రీరామ నవమి పూజలు

పామర్రు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వీరాంజనేయ స్వామి దేవస్థానంలోసీతారాముల కల్యాణోత్సవాలు శనివారం ఏకాహంతో ప్రారంభమైనాయి. స్వామివార్లను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కూటమినేతలతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈవో ప్రసాదరావు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, తాడిశెట్టి నరేష్, మంతెన రామంజనేయులు, వెన్నా శ్రీనివాసరావు, మట్టా వెంకటేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం



బొమ్ములూరులో నివాళులర్పిస్తున్న శివరామకృష్ణ



మొవ్వలో తహసీల్దార్ మస్తాన్...



చాట్లవానిపురంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా



హనుమంతపురంలో..

స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్‌రామ్

గుడివాడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గుడ్‌మెన్‌పేట వద్ద గల విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టూటౌన్ సీఐ నాగప్రసాద్, ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, జనసేన పార్టీ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ నివాళ్ళులర్పించారు. ఏరియా ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ ఇందిరాదేవి, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ జోన్స్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, నాయకులు, జనసేనపార్టీ కార్యాలయంలోబూరగడ్డ శ్రీకాంత్ తదితరులు నివాళులు అర్పించారు. **గుడివాడ రూరల్ :** దొండపాడు, తట్టివర్రు గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాటూరి జాన్ శ్యామ్యూల్, మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ బొమ్ములూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **గుడ్లవల్లేరు :** జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర్లో జనసేన నాయకుడు బుల్లా త్యాగరాజు(కింగ్) నివాళులర్పించారు. శేరిదగ్గుమిల్లి, శేరికల్వపూడి, డోకిపర్రు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. **కూచిపూడి :** మొవ్వ మండడలంలోని కూచిపూడి, చినముత్తేవి, అయ్యంకి, భట్లపెనుమర్రు, కాజ, మొవ్వ, కోసూరు, నిడుమోలు తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తహసీల్దార్ మస్తాన్, ఎస్సై నాగ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. అయ్యంకి, భట్లపెనుమర్రుల్లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. **పామర్రు :** చాట్లవానిపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి



ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్థానిక నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళలర్పించారు. బల్లిపర్రు, పెదమద్దాలి, జుజ్జవరం, తదితర గ్రామాల్లో పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ప్రాజెక్టు కమిటి వైస్ చైర్మన్‌గణేష్, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** జువ్వనపూడి, యలమర్రు, వెంట్రప్రగడ, వెంట్రప్రగడ శివారు పులివర్తివానిగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. వెంట్రప్రగడ దళితవాడలో విగ్రహ ప్రతిష్ఠ చేసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) చిలక ఆంజనేయులు, కూచిపూడి సుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వెంట్రప్రగడ, భూషణగుళ్ల, యలమర్రు, జువ్వనపూడిల్లో ఎంపీపీ గోగం సురేష్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి చీకుర్తి వరప్రసాద్ తదితరులు నివాళులు అర్పించారు. **తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు దళితవాడ వద్ద ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ పెనుముత్స రాధిక, టీడీపీ నాయకులు వేర్వేరుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాగంటిపాడులో, గరికపర్రులో పలువురు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. **పమిడిముక్కల :** ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దొండపాటి దావీదు, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. గోపాలకృష్ణాపురంలో ఎంపీటీసీ సభ్యుడు మర్రి దుర్గా రావు, సర్పంచ్ కె.పూర్ణకుమారి, సుబ్రమణ్యం, తదితరులు నివాళులర్పించారు.





సాయి సంజన కస్తూరికి బంగారు పతకం అందజేస్తున్న కృష్ణావర్సిటీ వీసీ రాంజీ, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

జీఈసీ వార్షికోత్సవంలో కృష్ణావర్సిటీ వీసీ రాంజీ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి) : సమాజం పట్ల బాధ్యతతో విద్యార్థులు వ్యవహరించాలని కృష్ణా విశ్వ విద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ కె.రాంజీ అన్నారు.

శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా వీసీ పాల్గొన్నారు. ఈసీఈ విద్యార్థిని కమ్మెల సాయి సంజన కస్తూరికి ఉత్తమ ఔట్ గోయింగ్ స్టూడెంట్‌గా వల్లభనేని కృష్ణ కు టుంబరావు స్మారక బంగారు పతకం, పురస్కారాన్ని, నగదు బహుమతిని వీసీ అందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, బహుమతులు అందజేశారు. వీసీని యాజమాన్యం సత్కరించి, జ్ఞాపికను అందజేసింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకట కృష్ణారావు, డాక్టర్ బెనర్జీ, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వార్షికోత్సవ కన్వీనర్ డాక్టర్ బి.దాసు, వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి, కో-కన్వీనర్ డాక్టర్ టి.శ్రీనివాస్, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.ఎం.రంగబాబు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పామర్రు, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): జుజ్జవరం జాతీయ రహదారి పక్కన ఓ రైతుకు చెందిన వరి గడ్డివాముకు శనివారం నిప్పు అంటుకుని అగ్నికి ఆహుతైంది. అదేసమయంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్వయంగా మంటలను ఆర్పేందుకు నీటిని చల్లారు. ఎస్సై రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వెనిగండ్ల, రావికి చాట్రగడ్డ కృతజ్ఞతలు

నందివాడ, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): తనపై నమ్మకం ఉంచి మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులకు గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన చాట్రగడ్డ రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న కూటమి ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.







పింగళి వెంకయ్య, పోలవరపు శేషయ్య విగ్రహాలు ఆవిష్కరించి, గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుక

కూచిపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామం భట్లపెనుమర్రులో పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల స్థాపించి 75 వసంతాలు పూర్తైన సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వజ్రోత్సవ (డైమండ్ జూబ్లీ) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్యతోపాటు పాఠశాల భవన నిర్మాణ దాత పోలవరపు శేషయ్య విగ్రహాలను ఎన్ఆర్ఐలు, గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల సమక్షంలో పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలైన సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. ఆనాటి అల్లర్లు, ఆటలు, పాటలు నెమరువేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సీబీఆర్ అకాడమీ చైర్మన్ చలసాని బాబూ రాజేంద్ర ప్రసాద్, చలసాని శాయోజీరావు, విద్యాకమిటీ చైర్మన్ వేముల నాగేశ్వరరావు, కృష్ణవేది విద్యాసంస్థల అధినేత చిగురుపాటి వరప్రసాద్, గ్రామసర్పంచ్ మట్టా ఇందిరా, ఉపసర్పంచ్ చలసాని వెంకట రత్నం, ఎంపీపీ కొండేటి ఇందిర, పూర్వ విద్యార్థులు పాల్గొన్నార





సంపద తయారీ కేంద్రం పక్కనే చెత్తను కాల్చేస్తున్న పంచాయతీ సిబ్బంది, రహదారిపై కమ్మేసిన పొగ

చెత్తను కాల్చేస్తున్న పంచాయతీ!

● సంపద సృష్టి చేయకుండా నిర్లక్ష్యం ● వాహనదారుల వెతలు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో కరకట్టపై శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తను దహనం చేశారు. దీంతో దట్టమైన పొగతో మూడు గంటల పాటు కరకట్టపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పక్కనే ఉన్నప్పటికీ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు గ్రామంలోని చెత్తను ట్రాక్టర్‌పైన, వ్యానుతోను తెచ్చి కరకట్టపై పోస్తు శనివారం కాల్చివేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు చెత్తను కరకట్ట రహదారిపై వేసి శనివారం ఆ చెత్త గుట్టలను కాల్చివేస్తున్నారని స్థానికులు తెలిపారు. తోట్లవల్లూరులో మార్చి 15వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించి సెంటర్లో ప్రజల చేత ప్రతిజ్ఞలు చేయించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో చెత్తను వేసి సంపద సృష్టిస్తామని అధికారులు చెప్పారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో పని చేసే విధంగా చర్య లు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తుంటే అందుకు విరుద్ధంగా చెత్తను కాల్చివేయటం శోచనీయమన్నారు. పొగ కాలుష్యాన్ని సృష్టిస్తు పర్యావరణానికి హాని చేయటమే కాకుండా, కరకట్ట రహదారిపై ప్రయాణించే బస్సులు, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సంపద తయారీ కేంద్రాలు లక్ష్యం మేరకు పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ఎన్జీవో దివి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

అవనిగడ్డ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో దివి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశ హాలులో శనివారం ఎన్నికల అధికారి కోటేశ్వరరావు అధ్యక్షతన హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ప్రభాకర్, జనరల్ సెక్రటరీగా సుమన్, ట్రెజరర్‌గా పి.చంద్రమోహన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జనార్దనరావు, వైస్ ప్రెసిడెంట్‌గా రోజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా జి.అశోక్, లక్ష్మి, విజయ్ కుమార్, వినయ్ బాబు, బేబీ షాలిని, జాయింట్ సెక్రటరీలుగా నాగగోపికృష్ణ, బిందు, అరుణ కుమారి, రవితేజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మనోజ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.


మలకాపట్నం బాలుర హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

• కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేదరికం ప్రతిభకు అడ్డుకాదని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని కలెక్టర్ బాలాజీ ఉద్బోధించారు. మలకాపట్నంలోని సమీకృత హాస్టల్‌ను శనివారం కలెక్టర్ సందర్శించారు. వేమూరి రాంజీ పంతులు స్థాపించిన ఈ హాస్టల్‌లో చదువుకున్న పామర్రు మండలం పెదమద్దాలికి చెందిన కాకి మాధవరావు, రామకృష్ణయ్య లు ఐఏఎస్‌లు అయ్యారన్నారు. విద్యార్థుల లక్ష్యాలను తెలుసుకున్నారు. ప్రశ్నించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీఆర్వో చంద్రశేఖర్, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. హాస్టల్ వెనుక లోతైన చెరువును, శిథిలమైన భవనాలను హాస్టల్ వార్డెన్ కలెక్టర్‌కు చూపించారు. వర్షం వస్తే హాస్టల్ ప్రాంగణమంతా ముంపునకు గురవుతుందన్నారు. హాస్టల్‌లోని గార్డెన్‌లో కూరగాయలు పండించాలని విద్యార్థులకు సూచించారు. కాగా మలకాపట్నంలోని సమీకృత హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న భోజనాలపై మునిసిపల్ కమిషనర్ ఆరా తీశారు. కలెక్టర్ సందర్శించిన అనంతరం కమిషనర్ హాస్టల్‌కు వెళ్లి హాస్టల్ పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని కమిషనర్ సూచించారు.


మోపిదేవిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమౌతున్న గృహాలు


బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నాలుగిళ్లు దగ్ధం

మోపిదేవి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాలుగు గృహాలు దగ్ధమైన ఘటన శనివారం మోపిదేవిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మోపిదేవి నుంచి అవనిగడ్డ ప్రధాన జాతీయ రహదారి వెంబడి నివశిస్తున్న మోర్ల సీతామహాలక్ష్మి, పెండ్ర మరిసిని, సింగోతు రంగారావు, రాజులపాటి రాజేశ్వరీల గృహాలు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి నాలుగు గృహాలు దగ్ధమై నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో అవనిగడ్డ అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా ప్రదేశానికి చేరుకుని మంటలను అదుపు చేశా రు. లక్ష రూపాయలపై నష్టం వాటిల్లినట్లు వీఆర్వో బొడ్డు శ్రీనివాసరావు అధికారులకు తెలియజేశారు. షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన నాలుగు గృహాల లబ్ధిదారులకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు అందించారు. ఆర్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

కోడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ కాల్ వచ్చిందని ఇంటి నుంచి బయటకి వెళ్లి యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన నక్కవానిదారి గ్రామంలో జరిగింది. జరుగు సత్యనారాయణ కుమారుడు లక్ష్మీవర్ధన్ (22) బీటెక్ పూర్తి చేశాడు. తన స్నేహితులతో కలిసి కేటరింగ్ పనులకు వెళుతూ ఉంటాడు. ఈనెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ కాల్ వచ్చిందని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 3వ తేదీన లక్ష్మీవర్ధన్ పుట్టినరోజు కాబట్టి స్నేహితులతో గడపటానికి వెళ్లాడని తల్లిదండ్రులు భావించారు. అయితే లక్ష్మీవర్ధన్ 4వ తేదీ వరకు ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి సత్యనారాయణ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆయన కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం నాగాయలంక మండల పరిధిలోని పాతఉపకాలి, కోడూరు మండల పరిధిలోని బసవవానిపాలెం గ్రామాల మధ్యగా సముద్రపు కరకట్ట లోపల మడ అడవుల్లో లక్ష్మీవర్ధన్ ఉరితాడుకు వేలాడుతూ అనుమానాస్పదంగా మరణించి ఉన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యువకుమార్, కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు.


లక్ష్మీవర్ధన్ (ఫైల్)


వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి, విద్యార్థినుల నృత్య ప్రదర్శన


మహతి కళావేదికపై కూచిపూడి నాట్య ప్రదర్శన

సాంకేతిక విద్యలో నైపుణ్యంతోనే ఉద్యోగాలు

పెడన రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక విద్యలో నైపుణ్యంతోనే గ్రామీణ ప్రాంత విద్యార్థులు దేశ విదేశాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని ప్రముఖ నృత్య కళాకారిణి పద్మశ్రీ డాక్టర్ గడ్డం పద్మజారెడ్డి అన్నారు. నందమూరి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. సాంకేతిక విద్య ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమయ్యేదని, అక్కడ ఉన్న వారు మాత్రమే ఇంజనీరింగ్ విద్య చదవగలిగే వారని, అయితే, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుతో అనేక పేద కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుకుంటున్నాయన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా మొబైల్, ట్విట్టర్, ఫేస్‌బుక్ లాంటి ఆధునిక సాంకేతికాంశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. లాభాపేక్ష లేకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థుల నైపుణ్యం కోసం అనేక సంస్థలతో కార్యక్రమాలు రూపొందించటం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్, డిప్లొమో కళాశాలల ప్రిన్సిపాల్స్ బీఆర్ఎస్ రెడ్డి, ఎస్‌కెవి ప్రసాద్ వార్షిక నివేదిక సమర్పించారు. పద్మజారెడ్డి నృత్య ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ జి.ఎం.ప్రసాద్, సెక్రటరీ టి.మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డి.బాబా, టిసాయి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మహతి కళావేదికపై ప్రదర్శించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు శిష్యబృందం అన్నమయ్య కీర్తనలకు నర్తించారు. వెంపరాల సృజన పుష్పవిలాపం పద్యాలను హృద్యంగా ఆలపించారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలను వినిపించారు. కళాకారులను డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య సత్కరించారు.

ఐవీఎం సేవలు స్ఫూర్తిదాయకం

• ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ • 30 మందికి కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే మండలి, ఐవీఎం సురేష్

చల్లపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ అందిస్తున్న సేవలు స్ఫూర్తివంతమైనవని ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం హోమ్‌లో వక్కలగడ్డ కమలానెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఏ విపత్తు వచ్చినా, ఏ సమయంలోనైనా సేవలందించే సంస్థ ఐవీఎం అని ప్రశంసించారు. వక్కలగడ్డ కమలా నెహ్రూ మహిళా మండలి స్థాపించిన నాటి నుంచి నేటి వరకూ మహిళాభ్యున్నతికి చురుకైన పాత్ర పోషిస్తోందన్నారు. ఐవీఎం డైరెక్టర్లు వేములపల్లి సురేష్ - రోజా దంపతులు మాట్లాడుతూ, 2006లో ఐవీఎం ఆధ్వర్యంలో కుట్టుశిక్షణా శిబిరాలు నిర్వహించటం ప్రారంభించి అనేక బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేశామన్నారు. గ్రామాల్లో పేద మహిళల జీవనోపాధికి, స్వయం ఉపాధి లక్ష్యంగా సేవలందిస్తున్నామన్నారు. ఘంటసాల ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, రైతుసంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా మండలి అధ్యక్షురాలు హనుమానుల రాణీ కుమారి, మల్లుపెద్ది రత్నకుమారి, ట్రస్ట్ ప్రతినిధులు నాదెళ్ల ఫణి, విజయ, స్వితిన్, సోఫి, శిక్షకురాలు నాగమణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మోపిదేవి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రత్యేక జాతీయ సేవా శిబిరంలో భాగంగా మోపిదేవిలో పరిసరాలు శుభ్రపరిచి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలను శుభ్రం చేసి ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రహదారి పనులు వెంకట్రామ్ పరిశీలన

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో పునః ప్రారంభం అయిన అవనిగడ్డ - కోడూరు రోడ్డు పనులను కూటమి నాయకులతో కలిసి మండలి వెంకట్రామ్ పరిశీలించారు. డీఈఈ ఎం.రమేష్ మాట్లాడుతూ మే నెలాఖరు లోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

చర్చిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఘంటసాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి చర్చి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కె.ప్రతాప్ రెడ్డి సంఘ పాస్టర్లకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాల చర్చి పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా చర్చిలకు రక్షణ కల్పించటంతోపాటు ఏమైనా సంఘటనలు జరిగితే ఆధారాలు లభ్యమవుతాయని తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు ముదిరాజ్‌పాలెంకు చెందిన పరిసే వెంకటేశ్వరమ్మ శనివారం మృతి చెందింది. వెంకటేశ్వరమ్మ దహన సంస్కారాల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.5వేల ఆర్థిక సాయం అందజేసింది. పడవల మోహన్ త్రినాథ్, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాములోరి ఎదుర్కోలు సన్నాహం


ఎదుర్కోలో సన్నాహంలో పాల్గొన్న మంత్రి రవీంద్ర, నీలిమ దంపతులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బందరుకోట కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణం ఏర్పాట్లలో భాగంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన సతీమణి కొల్లు నీలిమ శనివారం రాత్రి ఎదుర్కోలు సన్నాహం నిర్వహించారు. మేళతాళాలతో, కోలాట ప్రదర్శనలతో బందరుకోట నుంచి మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి వరకు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి వద్ద ఎదుర్కోలు సన్నాహ కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, జిల్లా కేంద్రం మచిలీపట్నం భద్రాద్రి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేశారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి


జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రాంజీ, ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి ప్రదాత అని వక్తలు పేర్కొన్నారు. బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా జరిపారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఉపకులపతి కూన రాంజీ ఎస్పీ కార్యాలయంలో ఆర్. గంగాధరరావు, లేడీయాంప్తిల్ పాఠశాలలో డీఈవో పి.వి.జె. రామారావు తదితరుల జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెడన :** జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్, కమిషనర్ మన్నం గోపాలరావు, కౌన్సిలర్ పిచ్చిక సతీష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య తదితరులు నివాళులర్పించారు. **గూడూరు :** గూడూరులో కాగిత వెంకట్రావు కాలనీ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతన స్వామి, దాసరి ఉమా సాయిరామ్, కోలపల్లి రజని పాల్గొన్నారు. **చల్లపల్లి :** రామానగరం దళితవాడ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సీఐ ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. కొల్లూరి బసవ, కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా, కొల్లూరు సురేంద్ర, బాబు, కుట్టి పాల్గొన్నారు. సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సూర్యప్రకాశరావు తదితరులు నివాళులు అర్పించారు. **నాగాయలంక :** బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మంచాల తిరుపతి వరప్రసాద్, తానంకి పోతురాజు నివాళులు అర్పించారు. **అవనిగడ్డ :** సీతాయిలంకలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే మం డలి బుద్దప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **అవనిగడ్డ రూ రల్ :** మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ తుంగల సుమతి దేవి, ఎంపీడీవో మరియకుమారి నివాళులర్పించారు. షేక్ నజీర్ బాషా, ఈవోపీఆర్‌డి అరుణకుమారి, ఇంచార్జ్ ఈవో అనిత, మహేంద్ర పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నలుకుర్తి

లంకపల్లిలో విగ్రహావిష్కరణ

ఘంటసాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లంకపల్లిలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని మాజీ ఎంపీటీసీ సభ్యుడు విగ్రహ దాత నలుకుర్తి సురేష్ ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు నలుకుర్తి సుప్రర్తన్, కొల్లూరి సురేష్, పెనుమాక రత్నగిరి, కుంపటి అరుణ్ కుమార్, దిరిశం సుధీర్, నడకుదురు జనుష్, కొల్లూరి జేమ్స్, ఇసుకపల్లి విక్కి, గురువిందపల్లి ర మేష్, కొడాలి సురేష్, బుర్రె నరేష్, కుంపటి పరంజ్యోతి, ఉడుముల సాకేత్, గుండుపల్లి నాగరాజు, పెనుమాక బాబు తదితరులు పాల్గొన్నారు.